క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడవ తరగతిలో ఓసీ జనరల్ - 2, ఎస్సీ జనరల్-1, 8వ తరగతిలో ఓసీ జనరల్-2, 9వ తరగతిలో ఓసీ జనరల్-2, ఎస్సీ జనరల్-1 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను పాఠశాలలో అందించాలన్నారు. ఈనెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ కమ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

30న రాజకీయ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న రణధీర్

ఆత్మకూరు: పట్టణంలో ఈనెల 30న నిర్వహించనున్న సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి రణధీర్ కోరారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి దేశస్థాయిలో జరిగే రాజకీయ అంశాలపై తరగతులు ఉంటాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు స్వాములు, సురేంద్ర, షేక్ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాటపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పగిడ్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు. మాతాశిశు సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు డయేరియాపై అవగాహన కల్పించారు.

బెయిల్ మంజూరు చేయడం దారుణం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: గతంలో ముచ్చుమర్రి ఎస్ఐగా, ప్రస్తుతం చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు సీఐగా విధులు నిర్వర్తిస్తున్న మారుతీశంకర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించిన రోజే బెయిల్ మంజూరు చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నేత ఫక్కీరిసాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. పగిడ్యాల మండల పరిధిలోని ఘనపురం గ్రామంలో నరేంద్రనాథరెడ్డి, నాగేంద్రరెడ్డి కేసులో సీఐ మారుతీశంకర్‌కు నందికొట్కూరు సివిల్ జడ్జి ఏడాది జైల్ శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారన్నారు. అదే రోజు గంటకే బెయిల్ మంజూరు చేయడం నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. సీఐటీయూ జిల్లా నేత గోపాలకృష్ణ, నాయకులు కొమ్ము వెంకటేశ్వర్లు, గంధం హుసేనమ్మ, శ్రీరాములు, రాజు, సుధాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

కాచిన నీటిన తాగడం ఉత్తమం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగలక్ష్మీదేవి

పాములపాడు: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కాచి వడగట్టిన నీటిని తాగాలని డాక్టర్ నాగలక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని జూటూరు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో 2 రోజుల నుంచి కొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వాతావరణంలో మార్పు చోటు చేసుకుందన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కలుషిత నీటి వల్లే ఎక్కువ రోగాలు వ్యాపిస్తాయని వివరించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సభ్యత్వం రెన్యూవల్ చేసుకోండి

నందికొట్కూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని నందికొట్కూరు, బ్రాహ్మణకొట్కూరు సహకార సంఘాల సీఈఓలు అశోక్, రబ్బానీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రెండు ఫొటోలతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేనిపక్షంలో సభ్యత్వం కోల్పోతారని తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

- మనస్సును నిగ్రహించుకోవడమే యోగా
- శ్రీశైలప్రభ సంపాదకులు డాక్టర్ సి.అనిల్‌కుమార్

శ్రీశైలంటెంపుల్: మనస్సును నిగ్రహించుకోవడమే యోగా అని, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని శ్రీశైలప్రభ సంపాదకులు డాక్టర్ సి.అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ దక్షిణమాడ వీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞానానికి నిలయమైన భారతదేశంలో ఎన్నో వేల ఏళ్ల నుంచి అభివృద్ధి చెందిన పలు శాస్త్రాలలో యోగశాస్త్రం ఒకటన్నారు. యోగా అనేది మన సంస్కృతిలో అనాదిగా ఆచరణలో ఉన్నప్పటికీ పతంజలి మహర్షి ద్వారా ప్రాచుర్యం పొందిందన్నారు. ఒంగోలుకు చెందిన యోగా శిక్షకులు, యోగాచార్య, గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం భక్తులతో యోగాసనాలు చేయించి యోగా గురించి వివరించారు. అనంతరం యోగా శిక్షకులకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన ఉప కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, ఏఈఓ ఎం.హరిదాసు, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన గురుకుల పాఠశాల మైదానంలో యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ సిబ్బందితో పాటు అధికారులు డి.వి.రమణ, రంగస్వామి, సుబ్బారావు, అమరేశ్వరరావు, పి.సుంకన్న పాల్గొన్నారు. అలాగే వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమిశెట్టి మల్లికార్జున, రవికుమార్, మారెం లక్ష్మయ్య, వెంకట్రావు, గంగయ్య, నాగశేషు, లింగం.లక్ష్మయ్య యోగా సాధన చేశారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు, యోగాసానాల్లో విద్యార్థులు


యోగా చేస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసులు


యోగా చేస్తున్న విద్యార్థులు

వెలుగోడు: యోగాతో శారీరక, మానసిక ప్రయోజనాలు కలుగుతాయని ఎస్‌ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో శుక్రవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, నిరాశ, నిస్పృహాల నుంచి బయటకు తీసుకు రావడానికి ఉపయోగపడుతుందనీ చెప్పారు. కార్యక్రమంలో కెనారా బ్యాంక్ మేనేజర్ సూర్యదేవనాయక్, సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యోగా సంపూర్ణ ఆరోగ్యానికి బాట

మహానంది: విద్యార్థి దశలోనే యోగా అలవరుచుకోవడం ద్వారా మంచి జీవనశైలి ఉంటుందని మహానంది వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సరోజినీదేవి అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఒత్తిడి పెరిగిపోయిందని, యోగా ద్వారా ఒత్తిడిని జయించడంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు.

- బొల్లవరం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించి, యోగా ఆసనాలు, వాటి ప్రయోజనాల గురించి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామంచంద్రారెడ్డి వారికి వివరించారు.
- బండిఆత్మకూరు మండలం చిన్నదేవలాపురంలోని నారాయణపురం హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో, పెద్ద దేవలాపురంలో, శింగవరం తదితర గ్రామాల్లో యోగా దినోత్సవం నిర్వహించినట్లు ఏపీఓ వసుధారెడ్డి, ఈఓఆర్‌డీ శ్రీనివాసులు, ఏఓ హనీఫ్‌ఖాన్ తెలిపారు.
- కర్నూలు నగరంలోని చాణిక్యపురి కాలనీకి చెందిన మహిళలు అపర్ణ, దీప, సుభద్రమ్మ, పద్మ, చంద్రకళ తదితరులు శుక్రవారం మహానందిలో యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు.
- బండిఆత్మకూరులోని కస్తూర్బా పాఠశాలలో యోగా గురువులతో యోగాసనాలు, వాటి ఫలితాలపై విద్యార్థులకు వివరించారు. ఎంఈఓలు యశోధ, మోహన్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు నాగరాజు, ప్రిన్సిపాల్ దాక్షాయణీ, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలకు యోగా గురించి వివరిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

ఆత్మకూరు: యోగా ఆరోగ్యానికి రక్షణ కవచమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణునాగ విజయ్ పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనగా ఇంద్రియాలను నిగ్రహపరుచుకుని మానసిక శక్తులన్నింటినీ ఏకంచేసి ఏకాగ్రతను సాధించడమమేనన్నారు. ప్రతిఒక్కరూ యోగా సాధన చేసి ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. సూర్య నమస్కారం, ఆసనాలు చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, పద్మావతిభాయ్, శశిధరయ్య, రామకృష్ణారెడ్డి, సుబ్బమ్మ, రాజశేఖర్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రఘురామచార్యులు మాట్లాడుతూ యోగా ప్రాధాన్యతను వివరించి నిత్యజీవితంలో యోగా ఆదరణను కొనసాగించాలన్నారు. అనంతరం యోగా ఆసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బ్రహ్మానందం, షేక్‌నాసిక్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా నిర్వహిస్తున్న అధ్యాపకులు


నందికొట్కూరు: జై కిసాన్ పార్కులో యోగా చేస్తున్న విద్యార్థులు


ఓం శాంతి బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో యోగా చిత్రం


జూపాడుబంగ్లా: వైకేపీ కార్యాలయంలో..


పగిడ్యాల: ఆదర్శ పాఠశాలలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


దుద్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో..


పాములపాడు కేజీబీవీలో..


కోటా జెడ్పీ హైస్కూల్‌లో..


మిడుతూరు కస్తూర్బా బాలికల విద్యాలయంలో..

నందికొట్కూరు: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ దామోదర్‌రెడ్డి, సబ్ జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నందికొట్కూరులోని కోటా ప్రభుత్వ హైస్కూల్, సబ్ జైల్, అల్వాల సత్రం, జై కిసాన్ పార్కులో ఓం శాంతి బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనస్సు, ఆత్మను ఏకం చేసే ఒక సాధనం యోగా అన్నారు. యోగాతో అనేక రోగాలు దూరమవుతాయని చెప్పారు. యోగాను జీవనంలో భాగం చేసుకుంటే ప్రశాంతత, ఆరోగ్యం సొంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట) హెచ్‌ఎం సలీంబాషా, పీడీ శ్రీనాథ్, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, సంఘ సేవకులు రామ్మూర్తి, రామిరెడ్డి, శ్రీధర్, రంగస్వామి, ఆర్ట్ శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

పాములపాడు: యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందని డాక్టర్ సావిత్రీ అన్నారు. స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూలులో యోగా శిక్షకులు శివ, మల్లీశ్వరి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అలాగే మండలంలోని వేంపెంట జెడ్పీహెచ్ స్కూలులో హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఈటీ నాగరాజు, స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారిణి రాజ్యలక్ష్మి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

- కొత్తపల్లి: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని ఎంపీడీఓ జవహర్‌బాబు అన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలను సందర్శించి సిబ్బందితో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. దుద్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు.
- జూపాడుబంగ్లా: స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఎం అంబమ్మ, యోగా ట్రైనర్ వెంకటరమణ పొదుపు మహిళలు, వైకేపీ సిబ్బందికి యోగాపై అవగాహన కల్పించారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం కొన్ని యోగాసనాలను చేసి చూపించారు. సీసీలు గాంధీ, విజయలక్ష్మి, నాయక్, నాగన్న పాల్గొన్నారు.
- పగిడ్యాల: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్, కస్తూర్బా, ఆదర్శ, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మెదడు చురుగ్గా పనిచేస్తుందని ఎంఈఓ సుభాన్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, సువర్ణ, కౌసల్యాబాయి, ప్రిన్సిపాల్స్ రమణమ్మ, సుజన, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉష పాల్గొన్నారు.
- మిడుతూరు: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో యోగా డే నిర్వహించారు. కలిగే ప్రయోజనాలను ఎస్ఓ విజయలక్ష్మీ వివరించారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

జూపాడుబంగ్లా: తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించకుండా చాబోలు గ్రామస్తుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, తాగునీటిశాఖ ఏఈ నాగేంద్రలను సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకుడు రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలిన నేపథ్యంలో గ్రామంలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించగా ఓ జీఎల్‌ఆర్ ట్యాంకులో కొంగపడి చనిపోయి దుర్వాసన వస్తుందన్నారు. మరో జీఎల్‌ఆర్ ట్యాంకును నెలలు తరబడి శుభ్రం చేయకపోవడంతో ట్యాంకులో మట్టిపేరుకుపోయిందన్నారు. ట్యాంకు పరిసరాలు, బోరులోంచి వచ్చే నీరు కలుషితమవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలి 30 మంది అస్వస్థతకు గురైనా అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడం తగదన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో అడ్డుకున్న వీఆర్‌ఏలు
- కాసేపటికే మళ్లీ కొనసాగింపు
- చేష్టలుడిగిన అధికారులు

రుద్రవరం: రెండు మండలాల్లోని 8 గ్రామాల ప్రజలకు తాగు నీరందించే ఎస్ఎస్ ట్యాంక్ చుట్టూ ఏర్పాటు చేసిన మట్టి కట్ట పక్కనే కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నా అడిగే నాథుడే లేరు. కాసులకు కక్కుర్తి పడ్డారో.. తమకెందుకులే అనుకుంటున్నారో ఏమో తెలియదు కానీ స్థానిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కొందరు ఇచ్ఛల విడిగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలిసి ఛీవాట్లు పెట్టడంతో గ్రామ స్థాయి అధికారులు హడావుడిగా ఘటనా స్థలానికెళ్లి ఆపేసినా కొంతసేపటికే మళ్లీ మట్టి తవ్వకాలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. రుద్రవరం మండల పరిధిలోని శ్రీరంగాపురం వద్ద శ్రీరంగాపురంతోపాటు రుద్రవరం, శిరివెళ్ల మండలాల్లోని పలు గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎస్ఎస్ ట్యాంకు నిర్మించారు. నీటి నిల్వ కోసం కొంత భూమిని సేకరించి చుట్టూ మట్టి కట్ట నిర్మించారు. ట్యాంక్ సమీపంలో దాదాపు మూడునాలుగెకరాల డీకేటీ భూమి ఉంది. దాన్ని ఆక్రమించుకునే క్రమంలో కొందరు అందులోని మట్టిని తవ్వుతున్నారు. ప్రస్తుతం ఆ కట్టకు దిగువ భాగంలోనే మట్టి తవ్వకాలు చేపట్టడంతో ఎస్ఎస్ ట్యాంకు కట్ట బలహీన పడే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టిని తరలిస్తున్నా గ్రామ స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో వారు గ్రామ స్థాయి అధికారులను దండించినట్లు సమాచారం. దీంతో ఓ వీఆర్‌ఏ శుక్రవారం ఘటనా స్థలానికెళ్లి మట్టి తవ్వకాలను ఆపేశారు. అయితే కాసేపటికే మళ్లీ మట్టి తవ్వకాలను ప్రారంభించడంతో ముడుపులు ముట్టి ఉంటాయని, అందుకే అనధికార అనుమతులు ఇచ్చి ఉంటారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వీఆర్వో నీలకంఠను వివరణ కోరగా ఇళ్ల వద్ద బేస్ మట్టాలకు తీసుకెళ్తామంటే కాదనలేకపోయామని, ఇందుకు ఎలాంటి ముడుపులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఎస్ఎస్ ట్యాంక్ తెగిపోక ముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మట్టి తవ్వకాలను ఆపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


శ్రీరంగాపురం ఎస్ఎస్ ట్యాంకు కట్ట పక్కనే మట్టి తవ్వుతున్న జేసీబీ

ఏరువాక పున్నమి

కొత్తపల్లి: తొలకరి మొదలైంది. ఖరీఫ్ సాగుకు అవసరమైన వర్షం కురుస్తుండడంతో రైతన్నలు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్‌కు ముందు రైతన్నలు శుక్రవారం ఏరువాక పున్నమిని జరుపుకుంటున్నారు. కాడెద్దులతో పంటపొలాల్లో దుక్కి దున్నడం, సేద్యం పనులు, విత్తనాలు వేయడం వంటి పనులు మొదలు పెట్టారు. మరికొంత మంది రైతన్నలు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.


లింగాపురంలో విత్తనం వేస్తున్న రైతన్నలు

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


రాముడు(ఫైల్)

ఆత్మకూరు రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోయ రాముడు (65) శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన కోలుకోలేక మరణించారు. విదేశీ పర్యటనలో ఉన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి.. రాముడి మృతి విషయం తెలుసుకుని సంతాపం తెలియజేస్తూ, అతని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కో - ఆప్షన్ సభ్యుడు రషీద్, పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ కూడా తమ సంతాపం తెలియజేశారు.

24న వైద్య శిబిరం

నందికొట్కూరు: పట్టణంలోని ఆర్టీసీ మేత్రాసన చర్చిలో ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు, పేదలకు ఈనెల 24వ తేదీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫాదర్ కేడీ జోసెఫ్ తెలిపారు. ఆర్‌ఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యుల సహకారంతో గ్యాస్ట్రబుల్ ఉన్నవారికి ఉచితంగా ఎండోస్కోపి, న్యూరాలజీ, మెదడు, వెన్నుపూస, నడుం నొప్పులు, నరాల బలహీనత, పక్షవాతం, స్ట్రోక్, వణుకుడు రోగాలు, ఫిట్స్, మూర్ఛ, తదితర వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. హెర్నియా, మొలలు, బొడ్డు హెర్నియా, థైరాయిడ్ గడ్డలు, అపెండిక్స్, వరిబీజం, కడుపులో గడ్డలు, కాలి పుండ్లు, కాళ్ల నరాలు ఉబ్బుట వ్యాధులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు.

వేలం పాటల్లో పెరిగిన ఆదాయం


వేలాలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో కొలువైన ఈశ్వర, చెన్నకేశవస్వామి దేవస్థానాలకు చెందిన భూములకు శుక్రవారం నిర్వహించిన వేలాల ద్వారా ఆదాయం పెరిగినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆలయాలకు చెందిన 42.06 ఎకరాల భూములకు నిర్వహించిన వేలాల ద్వారా రూ.8,45,400 వచ్చిందన్నారు. గత ఏడాది ఈ భూముల ద్వారా రూ.7,51,200 రాగా ప్రస్తుతం రూ.94,200 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. మొత్తం 26 మంది డిపాజిట్లు చెల్లించారన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంత శర్మ, అర్చకులు శరభయ్య, బృందం ముందుగా అలంకార మండపంలో స్వామి, అమ్మవారి దంపతులకు విశేషపూజలు చేపట్టారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు.


పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు